



జవాను అంతిమయాత్రలో పాల్గొన్న జనం



గోడు పట్టదా..!

ప్రహరీలేని సెంట్రల్ యూనివర్సిటీ
నిధులు మంజూరు చేయని గత ప్రభుత్వం
ఆగిన గోడ నిర్మాణం
అపరిచిత వ్యక్తులు వస్తున్నారంటూ విద్యార్థినుల ఆందోళన

7

అమ్మ చేతి విషం..!

- కుటుంబ కలహాలతో కాఠిన్యం
- బిడ్డలకు విషపు గుళికలు ఇచ్చి.. తానూ మింగిన మహిళ
- తల్లి, కొడుకు మృతి..
- కూతురు పరిస్థితి విషమం



చివరి క్షణాల్లో నాగచైతన్య




సుజాత మృతదేహం

7

వీరుడా వందనం

అమర జవానుకు కన్నీటి వీడ్కోలు

జనసంద్రంగా మారిన నార్పల
సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



7



మామిడి తోట

అన్నదాతకు అండ



మామిడికి బీమా

కూటమి ప్రభుత్వం నిర్ణయం
రైతుల హర్షం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యానానికి ఊపిరి పోసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మామిడికి బీమాను వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. జిల్లా రైతులకు అండగా నిలిచింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉద్యానాన్ని అటకెక్కించారు. ప్రోత్సాహకాలు ఆపేశారు. దీంతో ఉద్యాన రైతు తీవ్రంగా నష్టపోయాడు. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఉద్యానానికి మళ్లీ పూర్వవైభవం వస్తోంది. మామిడికి బీమాను వర్తింపజేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏటా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంట నష్టపోతున్న అన్నదాతలకు ఈ నిర్ణయం భరోసా నింపుతోంది. మామిడి పంట ఎకరాకి రూ.36వేలుగా బీమాను ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందులో రూ.1800 రైతు వాటా ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది.

20 వేల హెక్టార్లలో సాగు

జిల్లాలో బుక్కపట్నం, నల్లమాడ, తలుపుల, కదిరి, హిందూపురం, మండలాల్లో దాదాపు 15 రకాల మామిడి రకాలను రైతులు పండిస్తున్నారు. జిల్లా మొత్తంమీద 20వేల హెక్టార్ల పైచిలుకు విస్తీర్ణంలో మామిడి సాగవుతున్నట్లు ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. ఇందులో 95 శాతానికిపైగా బేనీషా, తోతాపురి 2, ఖాదర్, మల్లిక, రాజబేనీషా ఒక శాతం చొప్పున పండిస్తున్నారన్నారు. ఇటీవలిగా హిమాయత్ రకాన్ని సైతం పండిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బేనీషాకు మంచి డిమాండ్ ఉంది. ఆ తర్వాత కర్ణాటకకు ఎక్కువగా బేనీషా, తోతాపురి ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో రైతులు ఇప్పటికే మామిడి దిగుబడికోసం దుక్కులు చేసుకున్నారు. ఎరువులు వేయడం, కొమ్మలు కత్తిరించడం పూర్తి చేసి ప్రస్తుతం పూతలు బాగా రావడానికి మందులు పిచికారీ చేస్తున్నారు. ఎకరాకు 30వేల దాకా పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. తీరా పూతలు వచ్చే దశలో తుఫాన్లు దెబ్బకొడుతున్నాయి. తోటల్లో తేమ శాతం పెరిగితే దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతుండటంతో రైతన్నల్లో ఆందోళన పెరిగింది. తోటల్లో తడి ఆరిపోవడానికి రైతులు పైపైనే దున్నడానికి సమాయత్తం అవుతున్నారు. ఇది మరింత భారమని వాపోతున్నారు.

మూడేళ్లుగా నష్టాలే..

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మూడేళ్లుగా మామిడి రైతుకు నష్టాలు తప్పట్లేదు. సాధారణంగా డిసెంబరులో మామిడిచెట్లకు పూతలు ప్రారంభమవుతాయి. మార్చి వచ్చేసరికి మామిడి దిగుబడి వస్తుంది. మూడేళ్లుగా మామిడి పంటను అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయి. ఈ ఏడాది పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిసెంబరు నెల వచ్చి పదిరోజులు గడిచిపోయినా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో జిల్లాలో మామిడి పూతలు కనిపించడంలేదు. ముందుగా పూతలు వస్తే పంట తొందరగా వచ్చి, మంచిరేటు దక్కుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం డిసెంబరు నెలలో కూడా వరుస తుఫాన్ల ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు మామిడి రైతుల ఆశలను ఆవిరి చేసున్నాయి. దీంతో పెట్టుబడి కూడా దక్కుతుందో, లేదోనన్న ఆందోళనలో రైతన్నలు ఉన్నారు.

కూటమి అధికారంలోకి రావడంతో..

గత వైసీపీ హయాంలో ఉద్యానవనాన్ని పూర్తి అటకెక్కించారు. ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు నిలిపివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి అధికారంలోకి రావడం, తిరిగి ఉద్యాన పంటలకు, పనిముట్లకు, ప్రోత్సాహకాలు ప్రకటించడం, ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన రైతన్నల్లో ఆనందం నెలకొంది. వాతావరణ బీమా సైతం ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంట సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

మామిడికి బీమా వర్తింపు హర్షణీయం



ఐదెకరాల్లో పంట సాగుచేస్తున్నా. మూడేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టాలు చవిచూస్తున్నా. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మామిడికి బీమా ప్రవేశపెట్టడం హర్షణీయం. దీంతో నష్టాల నుంచి ఉపశమనం లభిస్తుంది.

- భూక్యా హరినాయక్, రైతు, పెద్దపల్లి

ప్రభుత్వ నిర్ణయంతో భరోసా



ఐదెకరాల్లో మామిడి సాగుచేశా. భారీగా పెట్టుబడులు పెట్టడం, తుఫాన్లతో నష్టపోవడం మూడేళ్లుగా పరిపాటిగా మారింది. ఈసారి నేటికీ పూత ఏర్పడలేదు. పంట నష్టపోతే బీమాతో ఉపశమనం లభిస్తుంది.

- రఘునాథరెడ్డి, రైతు, గౌకనపల్లి, నంబులపూలకుంట మండలం

15లోగా బీమా ప్రీమియం చెల్లించాలి



ఉద్యాన పంటలకు వాతావరణ నిర్దేశిత బీమాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు పంట నష్టపోతే బీమా సౌకర్యం అందుతుంది. మామిడి పంట ఎకరాకి రూ.36 వేల బీమా చేస్తారు. రైతు వాటా రూ.1,800 చొప్పున ప్రీమియం రైతుసేవాకేంద్రంలోగానీ, కామన్‌సర్వీసు సెంటర్‌లోగానీ డిసెంబరు 15లోపు చెల్లించాల్సి ఉంటుంది.

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

నాసిరకం అన్నం తినలేకపోతున్నాం

- గిరిజన పాఠశాల విద్యార్థుల ఆవేదన
- రోడ్డుపై బైఠాయింపు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కదిరి అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ వసతి గృహ పాఠశాలలో నాసిరకం భోజనం పెడుతుండడంతో తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం పెట్టాలని స్థానిక డిగ్రీ కళాశాల వద్ద జాతీయ రహదారిపై గురువారం బైఠాయించారు. వీరికి మద్దతుగా అఖిల భారత విద్యార్థి శక్తి (ఏఐఎస్‌ఎస్) నాయకులు మాట్లాడుతూ.. కుళ్లిన కూరగాయలు, పురుగుల బియ్యంతో భోజనం చేస్తున్నారన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం వడ్డించట్లేదన్నారు. విద్యార్థుల ఆందోళనతో వాహన రాకపోకలు స్తంభించాయి. పట్టణ సీఐ నారాయణరెడ్డి అక్కడికి చేరుకుని, విద్యార్థులకు సర్దిచెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఆందోళనలో ఏఐఎస్ఎస్ నాయకులు అవినాష్, ప్రదీప్, పృథ్వీ, రాకేష్, కిరణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

వరి చేనులో కొండచిలువ



కొండ చిలువను పట్టుకున్న రైతులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామ సమీపాన వరిచేనులో కొండచిలువ కలకలం రేపింది. రైతు బాబయ్య వరి సాగుచేశాడు. నూర్పిడి చేసి, వరిధాన్యాన్ని పొలంలోనే టార్పాలిన్ కప్పి ఉంచారు. గురువారం 10 అడుగుల పొడవున్న భారీ కొండచిలువ అక్కడ కనిపించడంతో రైతు బాబయ్య కేకలు వేశాడు. చుట్టుపక్కల రైతులు వచ్చి కొండచిలువను పట్టుకుని, దూరంగా తీసుకెళ్లి వదిలేశారు.

ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యం

పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలి
ప్రతి నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్కు
జిల్లా కలెక్టర్ ప్రజెంటేషన్



సదస్సులో సీఎం చంద్రబాబు

పుట్టపర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ప్రధాన ఉద్దేశంతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. అమరావతిలో రెండోరోజు గురువారం కలెక్టర్ల సదస్సులో చేతన్ జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో కియ కార్ల పరిశ్రమ, అనుబంధ సంస్థల ఏర్పాటుతో ఉమ్మడి అనంత జిల్లాలో ప్రజల తలసరి ఆదాయం పెరిగిన విధానాన్ని వివరించారు. అత్యున్నత శ్రేణి నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ నార్కొటిక్స్ (నాసెన్), బెల్ నిర్మాణంతో ఒనగూరిన ప్రయోజనాలను సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. పెనుకొండ, పాలసముద్రం, కప్పలబండ, హిందూపురం, రాళ్లఅనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద పరిశ్రమల కోసం గుర్తించి, సిద్ధంగా ఉన్న భూముల వివరాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ, అనుసంధానంతో జిల్లా పారిశ్రామిక రంగానికి చేయూతనిచ్చే అంశాలపై సమీక్ష చేశారు. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక వాడల్లో సదుపాయాలపై కలెక్టర్ చేతన్ అందించిన జిల్లా ప్రగతి నివేదికను ప్రదర్శించారు.



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

గస్తీ ఎక్కడ..?

ఇళ్లలో వరుస చోరీలు
పొలాల్లో సామగ్రి అపహరణలు
ఆలయాలనూ కొల్లగొడుతున్న వైనం
ధర్మవరం మండలంలో జనం బెంబేలు
అరికట్టడంలో పోలీసులు విఫలం



మహంకాళమ్మ హుండీ పగులగొట్టిన దృశ్యం (ఫైల్)

ధర్మవరంరూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస చోరీలతో జనం బెంబెలెత్తుతున్నారు. దొంగలు పేట్రేగిపోతున్నారు. ఇళ్లలో వరుస చోరీలు చేస్తున్నారు. పొలాల్లో వ్యవసాయ పరికరాలను అపహరిస్తున్నారు. ఆలయాలను కూడా వదలట్లేదు. కొల్లగొడుతున్నారు. ద్విచక్రవాహనాలను అపహరిస్తున్నారు. దొంగలు ఇంతలా రెచ్చిపోతుంటే పోలీసు గస్తీ ఏమైందని బాధితులు మండిపడుతున్నారు. చోరీలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గస్తీ పోలీసులు స్టేషన్‌కు పరిమితం కావడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే వరుస చోరీలు జరుగుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇళ్లు విడిచి బయటకు వెళ్లాలంటేనే జనం జంకే పరిస్థితి దాపురించింది. చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వ్యవసాయ పరికరాలే టార్గెట్

దొంగలు పొలాల్లో వ్యవసాయ పరికరాలను అపహరిస్తున్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలు, స్టార్టర్ పెట్టెలను ఎత్తుకెళ్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, ఆయిల్, కాపర్ చోరీ చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట కీలక సమయంలో పరికరాలను అపహరిస్తుండడంతో వాటిని తిరిగి సమకూర్చుకోవాలంటే భారం కావడంతో అన్నదాతలు పంటను కోల్పోయే దుస్థితి ఎదురవుతోంది. నేలకోట, ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, బిల్వంపల్లి గ్రామాల్లో తరచూ రైతుల పొలాల్లో స్ప్రింక్లర్లు, స్టార్టర్‌పెట్టెలు, పైపులను దొంగలు అపహరిస్తున్నారు.

కనిపించని గస్తీ

వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. ఇంటికి తాళాలు వేసి, బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఆలయాలు, పొలాలు, ద్విచక్రవాహనాలు చోరీ అవుతున్నా.. గస్తీ పోలీసులు మాత్రం కనిపించట్లేదు. వరుస చోరీలు జరుగుతున్నా గస్తీపోలీసులు ఎక్కడ ఉన్నారని బాధితులు మండిపడుతున్నారు. చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచి అరికట్టకపోతే ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

మండలంలో చోరీల్లో కొన్ని..

- గతంలో బడన్నపల్లికి చెందిన రైతులు బయప్ప, కాటమయ్య, గోపాల్, శివయ్య పొలాల్లోని రెండు ట్రాన్స్‌పార్మర్లను దొంగలు ధ్వంసం చేసి, అందులోని విలువైన కాపర్, ఆయిల్‌ను చోరీ చేశారు. దీనిపై రైతులతోపాటు ట్రాన్స్‌కో అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.



బడన్నపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ చోరీ చేసిన దొంగలు (ఫైల్)

- గతనెల 3వ తేదీన అర్ధరాత్రి గొట్లూరు గ్రామంలోని మహంకాళమ్మ, పెద్దమ్మ దేవాలయాల్లో బంగారు మంగళసూత్రంతో పాటు రూ.80వేలు చోరీ చేశారు.
- పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో వివేకానంద కాలేజీ సమీపంలోని కాలభైరవస్వామి ఆలయంలో గతనెల 10వ తేదీన దొంగలు చొరబడ్డారు. హుండీని పగులగొట్టారు. అందులో నగదు లేకపోవడంతో వెనుదిరిగారు.
- పట్టణంలో ఇటీవల ఓ మహిళ మెడలో బంగారు గొలుసును పట్టపగలే లాక్కెళ్లారు. దీనిపై బాధితురాలు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిధిలో ఆంజనేయులు అనే వ్యక్తి తన వాహనాన్ని స్టేషన్ బయట పెట్టి స్టేషన్‌లో పనిచూసుకుని బయటకు వచ్చాడు. ద్విచక్రవాహనం లేదు. బాధితుడు.. టూటౌన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు రికవరీ లేదు.
- ఈనెల 10న ధర్మవరం మండలంలోని రాంపురం వద్ద సత్యమ్మ దేవాలయంలో 130 తులాల వెండి ఆభరణాలు, 30వేల నగదు అపహరించారు.
- ఈనెల 10వ తేదీన కుణుతూరు కాలనీలో కృష్ణారెడ్డి ఇంటివద్ద ఉన్న విద్యుత్ మోటారు చోరీ అయినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- మండలంలోని పోతుకుంట బృందావన్ కాలనీకి చెందిన వడ్డే కొండా, సుజాతమ్మ, శివ, లక్ష్మీదేవి, నాగభూషణం ఇళ్ల తాళాలు పగులగొట్టి, దొంగలు బీభత్సం సృష్టించారు. వడ్డే కొండా ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి, రూ.లక్షదాకా నగదు, 9 తులాల బంగారు నగలు, సుజాతమ్మ ఇంట్లో రెండున్నర తులాల బంగారు, కాలి వెండిగొలుసులు, రూ.వెయ్యి నగదు, శివ, లక్ష్మీదేవి, నాగభూషణం ఇళ్లలో మగ్గం సామగ్రిని ధ్వంసం చేశారు.

చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం

ఇటీవల జరిగిన చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఆలయాలు, పొలాల్లో చోరీలపై ఫిర్యాదు చేసిన వెంటనే స్థానిక పోలీసుల ద్వారా సమాచారం సేకరించి, దుండుగల కదలికలపై నిఘా పెడుతున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వారిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

భక్తరహళ్లి

బ్రహ్మోత్సవాలకు వేళాయె

నేటి నుంచి వేడుకలు
16న భూతప్పల ఉత్సవం





ప్రత్యేక అలంకరణలో నరసంహస్వామి, ఆంజనేయుడు

మడకశిర రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. తొలిరోజు ధ్వజారోహణ, అంకురార్పణ, ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు, హనుమద్ వ్రతం, హోమాలు నిర్వహిస్తారు. 14న స్వామి వారి కల్యాణోత్సవం, 15న బ్రహ్మరథోత్సవం, 16న భూతప్పల ఉత్సవం, జ్యోతుల ఉత్సవం, 17న పూలపల్లకి, ముత్యాల పల్లకి, గరుడోత్సవం 18న కంబాలనరసింహ స్వామి జ్యోతుల పరుష, 19న వసంతోత్సవం, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేకాకర్షణ భూతప్పల ఉత్సవం

భక్తరహళ్లి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం భూతప్పల ఉత్సవం. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు, సంతానంలేనివారు భూతప్పల ఉత్సవం రోజు వేకువజామునే స్నానం చేసి, తడిదుస్తులతో భూతప్పలు వచ్చేదారిలో పడుకుంటారు. భూతప్పల కాలిస్పర్శతో వ్యాధులు నయమవుతాయనీ, సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. రైతులు పండించిన పంటలు దేవాలయంపై వేసి, ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు తీర్చుకుంటారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. భక్తుల సౌకర్యార్థం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. దేవాలయాల వద్ద 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పోలీసుల సూచన మేరకు ఉత్సవాలు జరిగే రెండు గ్రామాల్లో సీసీ కెమెరాలు బిగించాం.

- నరసింహరాజు, ఈఓ



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హనుమద్దీక్షల్లో భాగంగా చివరి రోజు గురువారం ఉదయం హనుమద్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మాలా ధారులు ఇరుముడులతో గుంతకల్లులోని బళ్లారి బైపాస్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయం వద్దకు చేరుకున్నారు. స్వామివారిని అలంకరించి తేరుపై ఆశీనులను చేసి, ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హనుమాన్ భక్తులతో కలసి టీడీపీ నాయకులు కసాపురం ఆలయం వరకూ ఏడు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. యువతుల సాంస్కృతిక ప్రదర్శనలు, కేరళ కళాకారుల మృదంగ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నెట్టికంటి ఆలయానికి చేరుకున్న హనుమాన్ భక్తులు ఇరుముడులను సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో గురువారం రాత్రి నిద్రచేశారు. కార్యక్రమంలో కసాపురం దేవస్థాన ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, టీడీపీ నాయకులు శ్రీనాథ్‌గౌడు, గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారంలో నెట్టికంటి ఉత్సవ విగ్రహం.. భక్తుల కోలాటం





సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ

వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణపై స్థానిక పంపనూరు నగరవనంలోని అతిథి గృహంలో అనంతపురం డివిజన్ అటవీశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వుకు సంబంధించిన సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఎన్ఎస్‌టీఆర్ - ఏసీఎఫ్ ధనరాజ్ సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ అప్పా పెట్రోలింగ్ యాప్, కెమెరా ట్రాప్ ఆపరేషన్ ద్వారా అడవిలో వన్యప్రాణుల గుర్తింపు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్స్ అక్బర్, నారపరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన బాలికల జట్టు



చక్రిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఆంధ్రా-15 బాలికల జట్టు సెమీస్‌కు చేరింది. బీసీసీఐ ఆధ్వర్యంలో జైపూర్‌లో జరుగుతున్న పోటీల్లో గుజరాత్‌తో ఆంధ్రా-15 బాలికల జట్టు తలపడింది. ఆంధ్రా మొదట బ్యాటింగ్ చేసి 35ఓవర్లలో ఆరు వికెట్లకు 187పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన గుజరాత్ 31.5ఓవర్లలో 164పరుగులకు ఆలౌట్ అయి ఓటమిపాలైంది. ఇందులో ఆంధ్రా జట్టులోని జిల్లా క్రీడాకారిణి చక్రిక మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. దీంతో ఆంధ్రా జట్టు సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.

స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. మైసూర్‌లో గురువారం నిర్వహించిన 62వ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఏపీ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులు హంజహుస్సేన్, హార్దిక్‌రెడ్డి, సుచీత్‌రెడ్డి కాంస్యపతకాలు సాధించారు. సుచీత్‌రెడ్డి మరో రజత పతకం సాధించారు. విజేతలతో పాటు చీఫ్‌కోచ్ నాగేంద్ర, కోచ్‌లు అనీల్‌కుమార్, హేమంత్‌కుమార్, అఖిల్, నరసింహ, ఆనంద్‌ను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రవిబాబు అభినందించారు.

పంటల బీమాకు మూడు రోజులే గడువు

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటల బీమా వర్తింపునకు ప్రీమియం చెల్లించేందుకు మరో మూడు రోజులే సమయం ఉందని, ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి ప్రీమియం కట్టేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏడీఏలు, ఏఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ ఈ పంట నమోదును పక్కాగా చేసేలా చొరవ చూపాలన్నారు. రెండు రోజుల్లో తుఫాన్ ఉన్నందున ఈ సమయంలో పంట కోతలు కోయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సివిల్‌సప్లై కార్పొరేషన్ ఆధ్వర్యంలో వరి పంట కొనుగోలు ప్రారంభమైందని, వరి పంట విక్రయించేందుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంటల సాగు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్ నాయక్, బాలూ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

హెచ్చెల్సీకి నీటి పండుగ

శిథిలావస్థకు చేరిన హెచ్ఎల్ఎంసీ



11పనులకు రూ.36 కోట్లు మంజూరు

కాలువ పటిష్టతకు అడుగులు

సామర్థ్యం పెంపునకు గ్రీన్ సిగ్నల్

ఐదేళ్ల పాటు నిర్లక్ష్యం

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జిల్లాకు తాగు, సాగునీటిని అందించే హెచ్చెల్సీని పూర్తిగా విస్మరించింది. హెచ్చెల్సీ నిర్వహణకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. జలవనరుల శాఖ అధికారులు మూడేళ్లలో ఐదుసార్లు హెచ్చెల్సీ పనుల కోసం ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. పైగా మంజూరైన పనులను సైతం రద్దు చేశారు. దీంతో హెచ్చెల్సీ నిర్వహణ ఇంజనీర్లకు భారంగా మారింది.


అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర ఎగువకాలువ (టీబీపీ హెచ్చెల్సీ)కు పూర్వవైభవం రానుంది. ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన హెచ్చెల్సీ సామర్థ్యాన్ని పెంచుతూ పటిష్ఠ పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకుగాను ప్రాధాన్యత కింద 11పనులను గుర్తిస్తూ రూ.36 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం 1800 క్యూసెక్కులుగా ఉన్న హెచ్చెల్సీ సామర్థ్యం పనులు పూర్తయితే 2500క్యూసెక్కులకు పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. చాలా చోట్ల బ్రిడ్జిలు, అండర్ టన్నెల్, రెగ్యులేటర్లు కూలిపోయాయి. అటువంటి ప్రాధాన్యత పనులు వచ్చే ఏడాది సీజన్‌లోపు పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే గుర్తించిన 11పనులకు సంబంధించి టెండర్లు వేశారు. జనవరి, ఫిబ్రవరిలలో పనులు ప్రారంభించేందుకు ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు.

11పనులకు రూ.36కోట్లు మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం హెచ్చెల్సీకి అత్యంత ప్రాధాన్యత కింద 11పనులను చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రూ.36కోట్లు నిధులను మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా హెచ్ఎల్ఎంసీ 165.028 కిలోమీటర్ వద్ద సగంలో ఆగిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59కోట్లు కేటాయించారు. 169.400కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91కోట్లు మంజూరు చేశారు. 155.81కిలోమీటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53కోట్లు కేటాయించారు. 115.167కిలోమీటర్ వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66కోట్లు కేటాయించారు. 117.794కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు, 147.395కిలోమీటర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్‌పాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21కోట్లు కేటాయించారు. 137.702కిలో మీటర్ వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21కోట్లు మంజూరు చేశారు. 189.126కిలోమీటర్ వద్ద పీపీబీఆర్ లింకుచానల్ పునర్ నిర్మాణానికి రూ.4.10కోట్లు కేటాయించారు. 189.126 కిలోమీటర్ వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు మంజూరు చేశారు. 115 కిలోమీటర్ నుంచి 130కిలోమీటర్ వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80కోట్లు కేటాయించారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటర్ వద్ద ఆఫ్‌టెక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22లక్షలు కేటాయించారు.



వర్షపు నీటికి పడిన గండి



గడువులోపు పనులు పూర్తి: రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయలేదు. తాజాగా పంపిన ప్రతిపాదనలకు అంగీకారం తెలిపారు. మొత్తం 11పనులకు సంబంధించి రూ.36కోట్లు నిధులు కేటాయించారు. ఏడు నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే టెండర్లను ఆహ్వానించాం. జనవరిలో అగ్రిమెంట్లు పూర్తి చేసి, ఫిబ్రవరిలో పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది టీబీ డ్యాం నుంచి నీటి విడుదల పూర్తి అయ్యే సమయం లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచిస్తాం. వచ్చే జూన్, జూలై నెలల్లోపు ప్రభుత్వం సూచించిన పనులను పూర్తి చేసి కాలువ పటిష్టతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

సీజ్ చేసిన బియ్యంతో అధికారులు



రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అశోక్‌లైల్యాండ్ వాహనంలో 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకలోని బంగారుపేటకు తరలిస్తుండగా.. పెనుకొండ మండలం గుట్టూరులోని సర్కిల్‌లో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అలాగే పెనుకొండ సమీపంలోని కియా ప్లాంట్ వద్ద మహేంద్ర గూడ్స్ వాహనంలో తరలిస్తున్న 18 క్వింటాళ్ల బియ్యాన్నీ సీజ్ చేశామన్నారు. వాటిని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఓ వాసుప్రకాష్, పెనుకొండ సీఎస్‌డీటీ ప్రభావతి పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా



మంత్రి పయ్యావుల

ఉరవకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రూరల్ సీఐ చిన్నగౌస్, ఎస్ఐ జనార్ధననాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాబ్‌మేళాకు ఐదువేల మందికి పైగా నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 68కిపైగా కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయి. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. శుక్రవారం కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశముందని, బయోడేటా, వివరాలను 95022 36524 నెంబర్‌కు వ్యాట్సాప్ చేయాలని సూచించారు.

ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తన కార్యాలయంలో మాజీ రిజిస్ట్రార్ శశిధర్‌తో కలిసి వాటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రథమ సెమిస్టర్ (ఆర్23) విద్యార్థులకు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని, ఈ పరీక్షలు నిర్వహించిన వారం రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈ లలితకుమారి, విభాగాధిపతులు భారతి, మమత, భువనవిజయ, కళ్యాణ్‌కుమార్, రామశేఖర్‌రెడ్డి, బాలనరసయ్య, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

16న రైల్వే పెన్షన్ అదాలత్

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైల్వే జోనల్ పరిధిలోని ఆరు డివిజన్లలో పెన్షన్ అదాలత్‌లను సోమవారం నిర్వహిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఏ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని సికింద్రాబాదు, హైదరాబాదు, గుంతకల్లు, విజయవాడ, గుంటూరు, నాందేడ్ డివిజన్లలోనూ, వివిధ వర్క్‌షాప్‌ల్లోనూ ఈ పెన్షన్ అదాలత్‌ను నిర్వహిస్తారన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రైల్వే ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ గెలుపు

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు కోసం ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ విజేతగా నిలిచింది. గురువారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో మొత్తం 14,359 ఓట్లకుగానూ 12,364 ఓట్లు పోలయ్యాయి. వాటిలో ఎంప్లాయీస్ సంఘ్ 5,966 ఓట్లతో మొదటి స్థానంలో నిలవగా, 5,723 ఓట్లతో మజ్దూర్ యూనియన్ రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఎంప్లాయీస్ సంఘ్ 243 ఓట్ల మెజారిటీతో గెలుపు సాధించింది. సంఘ్ నాయకులు కౌంటింగ్ హాల్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ సంఘంపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలుపుకుంటామని, కార్మిక పక్ష పోరాటాలను ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. కాగా ఎన్నికల్లో డీఎంఆర్‌కేఎస్ సంఘానికి 372, ఐఆర్ఎంయూకు 132, ఆర్ఎంయూకు 628 ఓట్లు రాగా, 113 ఓట్లు ఇన్‌వ్యాలిడ్‌గా తేలాయి. దక్షిణ మధ్య రైల్వే మొత్తం మీద ఎంప్లాయీస్ సంఘ్ కంటే మజ్దూర్ యూనియన్ అధిక ఓట్లను సాధించింది. జోన్ మొత్తం మీద సంఘ్ కంటే యూనియన్ 3,087 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది.



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ్ నాయకులు

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(డిసెంబరు): జిల్లాలోని పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని పెద్ద వడుగూరు, పామిడి పంచాయతీల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించిన లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అదే నిర్లక్ష్యం..!

రెవెన్యూ సదస్సుల్లో కనిపించని చిత్తశుద్ధి



కళ్యాణదుర్గం ప్రాంతంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

అక్కడే సమస్యకు పరిష్కారం.. అంతా తూచ్

గ్రీవెన్స్‌లాగేనే ఫిర్యాదుల స్వీకరణ.. ఆపై మౌనం

రోజువారీ సమాచారం ఇవ్వాలని సర్కారు ఆదేశాలు

అయినా పట్టించుకోని జిల్లా యంత్రాంగం

కలెక్టరేట్‌లో సమన్వయలోపం

అనంతపురం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను త్వరగా పరిష్కరించాలనే ఉద్దశంతో కూటమి సర్కారు రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈనెల 6న జిల్లాలో రెవెన్యూ సదస్సులను అట్టహాసంగా ప్రారంభించింది. తొలిరోజు 35 రెవెన్యూ గ్రామసభలను నిర్వహించగా.. 456 ఫిర్యాదులు వచ్చాయి. ఇలా జిల్లాలో 34 రోజుల్లో 540 రెవెన్యూ గ్రామాల్లో ఈ సదస్సులను ప్రభుత్వం నిర్వహించింది. అయితే అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో.. వారు సమస్యలపై అదే నిర్లక్ష్యం చూపుతున్నారు.

తొలి రోజున నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 456 ఫిర్యాదులు రాగా.. అందులో కేవలం 18 ఫిర్యాదులను మాత్రమే అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిపై అదే నిర్లక్ష్యం.

● వైసీపీ అరాచకాలు

వైసీపీ హయాంలో అనేక భూములు, స్థలాలను ఆన్‌లైన్‌లో మార్చడం, నకిలీపాస్ పుస్తకాలు తయారుచేయడం, బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందడం.. తదితర అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో అనేకమంది రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈ సదస్సుల ద్వారా తాము అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న భూముల సమస్యలు, కష్టాలు తీరుతాయని రైతులు, ప్రజలు ఆశించారు. ఆ సదస్సుల్లో ఫిర్యాదులు చేశారు. అయితే ఆ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు పెద్దగా శ్రద్ధ చూపడంలేదు.

● సమాచారం ఏదీ..?

ఈ సదస్సుల్లో వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కార విషయాలను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ వివరాలను పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించింది. ఏగ్రామంలో సదస్సు జరిగితే ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. ఎన్ని పరిష్కరించారో చెప్పాలని.. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టరేట్ నుంచి ప్రతిరోజు రెవెన్యూ సదస్సుల సమాచారం జిల్లాస్థాయి మీడియాకు తెలపాలని ఆదేశించింది. అయితే రెవెన్యూ సదస్సుల సమాచారం ఇవ్వడంలో అధికారులు ఏమాత్రం చిత్తశుద్ధి చూపడంలేదు. కనీసం జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో కూడా ఈ విషయంలో అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సెక్షన్ ఆఫీసర్లకు ఫోన్‌చేస్తే.. తాము చెప్పడానికి లేదని, డీఆర్ఓ ఆ సమాచారం చెబుతారని అంటున్నారు. ఈ డీఆర్ఓ తొలిరోజునే.. అది కూడా పదిసార్లు ఫోన్‌చేస్తే ఆ రోజు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత జరిగే ఏ ఒక్క రెవెన్యూ సదస్సు సమాచారం చెప్పలేదు. కనీసం ఫోన్ కూడా ఎత్తడంలేదు. కలెక్టరు అయినా ఫోన్ చేస్తే.. అడిగినదానికి సమాచారం ఇస్తుంటే.. కలెక్టరేట్ అధికారులు మాత్రం కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదు. సమస్యల పరిష్కారం అటుంచి.. కనీసం వాటి సమాచారమైనా ఇవ్వడానికి అధికారులు ఆసక్తి చూపడంలేదు. దీంతో గ్రీవెన్స్‌లాగే ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమం కూడా అబాసుపాలు కాక తప్పదని రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



భారీగా నీరు వృథా



జల్లిపల్లి సమీపంలోని అండర్ చానల్ వద్ద నీటి వృథా



వంకలో వృథాగా పారుతున్న నీరు

శిథిలావస్థలో పీఏబీఆర్ కుడికాలువ

చానల్స్ వద్ద పెద్ద ఎత్తున లీకేజీలు

తగ్గిన నీటి వేగం

చివరి చెరువులకు నీరు చేరేనా..?

కూడేరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ నుంచి నీరు పెద్ద ఎత్తున వృథా అవుతూ వంకల్లోకి వెళ్తోంది. కాలువకు అండర్ చానల్స్ ఉన్న ప్రదేశాల్లో నీరు లీకేజీ అవుతోంది. దీంతో కుడికాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. పీఏబీఆర్ నుంచి కుడికాలువకు గురువారం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. కూడేరు వద్దకు వచ్చే సరికి కాలువలో నాలుగు వందల క్యూసెక్కుల నీరు కూడా ప్రవహించడం లేదు. డ్యాం నుంచి కుడికాలువ నాలుగో కిలోమీటర్ సమీపంలోని అండర్ చానల్ వద్ద పెద్ద ఎత్తున నీరు వంకల పాలవుతోంది. కుడికాలువ 112 కిలోమీటర్లు ఉండగా గురువారం రాత్రికి 98 కిలోమీటర్లకు నీరు చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కూడేరు మండలంలోని వివిధ ప్రదేశాల్లో కాలువలో నీరు వృథా కారణంగా దిగువకు నీరు వేగంగా సాగడం లేదు. ఈ నెల రెండో తేదీన కుడికాలువ నీరు విడుదల చేయగా.. పది రోజులు అవుతున్నా వంద కిలోమీటర్లకు కూడా ఆ నీరు చేరలేదు. కుడికాలువ ద్వారా దాదాపు 49 చెరువులకు నీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 3.266 టీఎంసీల నీరు నిల్వ ఉందని, తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్‌లోకి 500 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

వైసీపీ పాలనలో కుడికాలువకు మరమ్మతులు చేయడానికి పైసా కూడా విడుదల చేయలేదు. అంతేకాకుండా కాలువలో అండర్ చానల్ ఉన్న ప్రాంతాలు దెబ్బతినడంతో నీరు వృథా అవుతోంది. కాలువలో కంపలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటి కారణంగా కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. ఏటా కాలువకు నీరు విడుదల చేసే సమయంలో కాలువ గట్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించడంతో పాటు కాలువకు మరమ్మతులు చేసేవారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో వీటికి నిధులు విడుదల చేయకపోవడంతో కాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువలో నీటి వేగం పూర్తిగా తగ్గిందని డీసీ డివిజన్ ఈఈ అబ్దుల్ షామీ తెలిపారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.14

అనంతపురం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.27వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 27వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 18వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 39 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి ప్రైమరీ పాఠశాల హయ్యర్ సెకండరీ స్కూలు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఒకటో తరగతి, ఇంటర్ ప్రవేశానికి జనవరి ఒకటో తేదీ నుంచి 31 లోగా www.ssshss.edu.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫీజు రూ.100 ఎస్‌బీఐలో చెల్లించాలని సూచించింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ధర్మవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మరణించింది. కర్ణాటక రాష్ట్రం దొడ్డబళాపూర్‌కు చెందిన నాగమణి (46), సోమశేఖర్ చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. శుభకార్యం కోసం వారు పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి ద్విచక్రవాహనంలో వచ్చారు. శుభకార్యం ముగించుకుని బైక్‌పై స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో వెళ్తుండగా... ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో నాగమణి తీవ్రంగా, సోమశేఖర్ స్వల్పంగా గాయపడ్డారు. నాగమణిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి మరణించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



ఈరేష్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి కే ఈరేష్ (43) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇతను స్థానిక రైల్వే షెడ్‌లో టెక్నీషియన్. కొన్ని రోజులుగా అతను తలనొప్పితో బాధపడుతున్నాడు. అతని భార్య నాగలక్ష్మి ఆస్తమాతో బాధపడుతోంది. ఇరువురి చికిత్స కోసం ఈరేష్ రూ.10 లక్షలు అప్పు చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఈరేష్ బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన నాగలక్ష్మి పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతదేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కాగా, ఈరేష్‌కు ఒక కుమారుడు ఉన్నాడు.



రోదిస్తున్న సుబ్బయ్య తల్లి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి, ఆలం



సుబ్బయ్య మృతదేహం వద్ద కుమారుడు, కుమార్తె



సుబ్బయ్యకు చివరిసారిగా సెల్యూట్ చేస్తున్న భార్య, పిల్లలు

అమర జవానుకు కన్నీటి వీడ్కోలు

జనసంద్రంగా మారిన నార్పల

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



సుబ్బయ్యకు గౌరవ వందనం సమర్పిస్తున్న ఆర్మీ అధికారులు

నార్పల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తోటి సైనికుల ప్రాణాలను కాపాడి, వీర మరణం పొందిన జవాను వెంకటసుబ్బయ్య అంతిమ యాత్రకు జనం పోటెత్తారు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని వ్యవసాయ భూమిలో గురువారం ఆయన అంత్య క్రియలను సైనిక లాంచనాలతో పూర్తి చేశారు. నార్పల మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. సుబ్బయ్య అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరై. జోహార్లు అర్పించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, పార్టీ నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్‌బాబు, పిట్టు రంగారెడ్డి, వైసీపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి తదితరులు సుబ్బయ్యకు ఘన నివాళులు అర్పించారు. జవాన్ సుబ్బయ్య భౌతిక కాయానికి కప్పిన జాతీయ జెండాను ఆయన భార్య, తల్లికి ఆర్మీ అధికారులు అందజేశారు. ఆర్మీ అధికారులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడంతోపాటు అన్నివిధాలుగా తోడ్పాటును అందజేస్తామని ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా సైనిక సంక్షేమ అధికారులు తిమ్మప్ప, రఫీ, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి, మాజీ సైనిక అధికారులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.

కన్నీటి సంద్రం

సుబ్బయ్య భౌతికకాయం వద్ద చివరి రోజున భార్య లీలావతి, ఇద్దరు పిల్లలు నిఖిల్ సాయి, ప్రియ కన్నీరు మున్నీరయ్యారు. 'డాడీ.. మాతో మాట్లాడు డాడీ.. పైకి లే' అంటూ చిన్నారులిద్దరూ తమ తండ్రిని తట్టిలేపేందుకు ప్రయత్నించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. 'వచ్చే సోమవారం వస్తానని ఫోన్‌లో చెబితివి కదా..? ఆ రోజు కోసం ఎంతగా ఎదురుచూశాను..? గంటలను లెక్కపెట్టుకుంటిని కదా..? చివరకు శవమై వచ్చవా..' అంటూ లీలావతి బోరున విలపించారు. తన భర్త భౌతిక కాయంమీద పడి వెక్కివెక్కి ఏడ్చారు.

కాంట్రాక్టర్ హత్య

ఆర్థిక లావాదేవీలు..

వివాహేతర సంబంధమే

కారణమని అనుమానం



రాజశేఖర్ (ఫైల్)

కొత్తచెరువు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైలేపల్లి సమీపంలో దారుణ హత్య జరిగింది. నల్లమాడ మండలం బొగ్గలపల్లి గ్రామానికి చెందిన గాండ్ల రాజశేఖర్(49) అనే వ్యక్తిని మైలేపల్లి చెరువు సమీపంలోని ఫాం హౌస్ వద్ద గురువారం హత్య చేశారు. సీఐ ఇందిర తెలిపిన వివరాల మేరకు, రాజశేఖర్ విద్యుత్ కాంట్రాక్టు పనులను చేస్తుంటారు. విద్యుత్ పరికరాలను నిల్వ చేసుకునేందుకు మైలేపల్లి చెరువు సమీపంలో, బెంగళూరు నగర మాజీ మేయర్ విజయ్‌కుమార్ ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నారు. రాజశేఖర్ వద్ద పనిచేస్తున్న వారు ఆ ఫాంహౌస్‌లో ఉంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి రాజశేఖర్‌ను కారులో ఎత్తుకుపోయారు. ఈ విషయాన్ని అక్కడ పనిచేసే యువకులు డయల్ 100కు తెలియజేశారు. పోలీసులు ఫాంహౌస్ వద్దకు వెళ్లి సమాచారం సేకరించారు. రాజశేఖర్ కోసం పరిసర ప్రాంతాలలో గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆ యువకులను స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు సేకరించారు. ఆ తరువాత ఫాంహౌస్ వద్దకు వెళ్లేసరికి తీవ్ర గాయాలతో రాజశేఖర్ మృతిచెంది కనిపించాడు. అతని ఒంటిపై దుస్తులు లేవు. విషయం తెలుసుకున్న రాజశేఖర్ భార్య సువర్ణ, కూతురు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిత్తూరు జిల్లాలో పనిచేసే కానిస్టేబుల్ సాయిప్రతాప్ రెడ్డి (9వ బెటాలియన్), అతని బావమరిది రవీంద్రారెడ్డిపై వారు అనుమానం వ్యక్తం చేశారు. సాయిప్రతాప్‌రెడ్డి బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తనకు ఫోన్ చేశాడని, తన భర్త గురించి అడిగారని రాజశేఖర్ భార్య పోలీసులకు తెలిపారు. పెనుకొండ మండలం వెంకటగిరి పాలెంకు చెందిన రవీంద్రారెడ్డి, ఆయన భార్య రాధికకు తన భర్త రూ.5 లక్షలు ఇచ్చారని, ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని వారిని అడుగుతుండేవారని తెలిపారు. ఆ డబ్బులు అడగవద్దని సాయిప్రతాప్ రెడ్డి తన భర్తను హెచ్చరించేవారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు వివాహేతర సంబంధం కారణమా, ఆర్థిక లావాదేవీలు కారణమా అన్నది తేలాల్సి ఉందని సీఐ తెలిపారు. పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అమ్మ చేతి విషం..!

కుటుంబ కలహాలతో కాఠిన్యం

బిడ్డలకు విషపు గుళికలు ఇచ్చి..

తానూ మింగిన మహిళ

తల్లి, కొడుకు మృతి..

కూతురు పరిస్థితి విషమం



రహిత్యను చికిత్స నిమిత్తం తరలిస్తున్న బంధువులు

గార్లదిన్నె, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య విభేదాలు రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. మరొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

గార్లదిన్నె మండల కేంద్రంలో సుజాత(38) తన కూతురు రహిత్య, కుమారుడు నాగ చైతన్య(12)కు విషపు గులికలు మింగించి, తాను తీసుకున్నారు. తల్లీకొడుకు మృతిచెందగా, రహిత్య పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు గార్లదిన్నె మండలం ఎర్రగుంట్లకు చెందిన నిమ్మకాయల సురేష్, సుజాత దంపతులకు 8 ఎకరాల చీనితోట ఉంది. వ్యవసాయం చేస్తు జీవనం కొనసాగించేవారు. వీరికి కూతురు రహిత్య, కుమారుడు నాగ చైతన్య ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఎర్రగుంట్ల నుంచి గార్లదిన్నెకు వలస వచ్చారు. అద్దె ఇంట్లో ఉంటూ కిరాణం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. రహిత్య చైన్నైలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. నాగచైతన్య గార్లదిన్నె విద్యా నికేతన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. దంపతుల మధ్య కొన్నాళ్లుగా విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. బంధువుల ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా వీరి ఇంట్లో చిన్నపాటి గొడవలు జరిగేవని తెలిసింది. ఈ క్రమంలో బంధువుల వివాహక వేడుకల్లోనూ బుధవారం ఇద్దరూ గొడవపడినట్లు తెలిసింది. ఇంటికి వచ్చాక బుధవారం రాత్రి కూడా గొడవ కొనసాగినట్లు సమాచారం. సురేష్ గురువారం తెల్లవారుజామున చీనీతోటలో పనుల నిమిత్తం ఎర్రగుంట్లకు వెళ్లారు. ఆ సమయంలో సుజాత విషపు గుళికలను తీసుకుని నిద్రమత్తులో ఉన్న కొడుకు, కూతురుకు తినిపించి నీళ్లు తాపించింది. ఆ తరువాత తాను కూడా విషపు గుళికలను మింగింది. గుళికలు వద్దని పిల్లలు అంటున్నా, నులి పురుగుల మాత్రలు అని నమ్మించి తినిపించింది. గురువారం ఉదయం ఎంతసేపటికీ దుకాణం తెరవకపోవడంతో పక్కింటి వారు వెళ్లి తలుపు తీసి చూశారు. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురినీ చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుజాత మృతి చెందింది. మెరుగైన చికిత్స నిమిత్తం కుమారుడు, కుమార్తెను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో కుమారుడు నాగచైతన్య మృతి చెందాడు. రహిత్య పరిస్థితి విషమంగానే ఉంది.

కుటుంబ కలహాలే కారణం

తన చెల్లెలు సుజాతను ఆమె భర్త సురేష్ మానసికంగా వేధించేవాడని రాములయ్య ఆరోపించారు. వివాహ వేడుకల్లో బంధువుల అందరి ముందు, ఆ తరువాత రాత్రి ఇంట్లో గొడవపడ్డాడని అన్నారు. అందుకే తీవ్ర మనస్తాపానికి గురైన సుజాత ఆత్మహత్యకు పాల్పడిందని కన్నీరు మున్నీరయ్యారు. తమ అల్లుడి వేధింపులు తట్టుకోలేకే కూతురు ఈ అఘాయిత్యానికి పాల్పడిందని సుజాత తల్లిదండ్రులు ఆరోపించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఆస్పత్రికి వెళ్లి విచారించారు. సుజాత సోదరుడు రాములయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హెల్మెట్ ధరించి ర్యాలీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ప్లీజ్.. హెల్మెట్ ధరించండి

నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసుల అవగాహన

ధరించని వారికి పువ్వులిస్తూ సూచన



హెల్మెట్ ధరించాలని పువ్వు ఇస్తూ సూచిస్తున్న ట్రాఫిక్ పోలీస్

అనంతపురం క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'ప్లీజ్... హెల్మెట్ ధరించండి... రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోకుండా కాపాడుకోండి. కనీసం మీ కుటుంబ సభ్యుల కోసమైనా హెల్మెట్ వాడండి..' అని అనంతపురం ట్రాఫిక్ పోలీసులు నగర వాసులను కోరారు. గురువారం ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధరించి.. నగరంలోని ప్రధాన సర్కిళ్ల మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి పువ్వులు అందజేసి మరీ సూచించారు. ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్ మాట్లాడుతూ... ముందుగా ట్రాఫిక్ పోలీసుల నుంచే ఈ మార్పు రావాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. మరో రెండురోజుల పాటు అవగాహన కల్పిస్తామని, త్వరలోనే జరిమానాలు విధించే అవకాశముందని అన్నారు.

పోక్సో కేసు నమోదు

మడకశిరటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను మాయమాటలు చెప్పి, తీసుకెళ్లిన పట్టణ పరిధిలోని బేగార్లపల్లికి చెందిన రాజేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. రాజేష్‌కు వివాహమై, ముగ్గురు పిల్లలున్నారు. మండలంలోని ఓ బాలికకు మాయమాటలు చెప్పి, ఈనెల 5వతేదీన తనతో తీసుకెళ్లినట్లు విచారణలో తేలిందన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. బేగార్లపల్లి సమీప పొలాల్లో ఉన్న రాజేష్‌ను పట్టుకున్నామన్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గోడు పట్టదా..!



అరకొరగా నిర్మించిన ప్రహరీ




అపరిచితులు వర్సిటీలోకి వస్తున్నారని ఆందోళన చేస్తున్న విద్యార్థులు

- ప్రహరీ లేని సెంట్రల్ యూనివర్సిటీ
- నిధులు మంజూరు చేయని గత ప్రభుత్వం
- ఆగిన నిర్మాణ పనులు
- అపరిచిత వ్యక్తులు వస్తున్నారంటూ విద్యార్థినుల ఆందోళన

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీలో భద్రత కరువైంది. దాదాపు రూ.270 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నా.. రూ.10 కోట్ల అంచనాతో తెలపెట్టిన ప్రహరీ నిర్మాణం మాత్రం కొన్ని సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉంది. వర్సిటీ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో.. అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆకతాయిలు, దొంగలు చొరబడి అలజడి రేపుతున్నారు. బాలికల హాస్టల్‌లోకి వెనుక వైపు నుంచి అపరిచత వ్యక్తులు వస్తున్నారంటూ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని మంగళవారం రాత్రి కూడా విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. స్పందించిన వీసీ ఏఎస్ఏ కోరి విద్యార్థులతో మాట్లాడి ఆందోళనలను విరమింపజేశారు.

ఏళ్లు గడుస్తున్నా...

కేంద్ర ప్రభుత్వ సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలంటే అందుకు తగిన భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి ప్రహరీని నిర్మించాలి. ఈ షరతుకు కట్టుబడి నాటి టీడీపీ ప్రభుత్వం 2018లో రూ.10కోట్ల అంచనాతో సెంట్రల్ యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. ఈ క్రమంలోనే 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం ముసురుకుంది. 2018 ఆర్థిక



ప్రహరీ గుర్తుగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు

సంవత్సర బడ్జెట్‌లో వర్సిటీ శాశ్వత భవనాల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల సద్వినియోగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అప్పటికే సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వర్సిటీ విద్యార్థులు తమకు శాశ్వత భవనాలు నిర్మించాలని పలుమార్లు ధర్నాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం కలుగచేసుకుని 2023 నుంచి శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టింది. అయినా ప్రహరీ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ గోడ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రహరీ నిర్మాణానికి తగిన నిధులను ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలి

వర్సిటీ ప్రహరీని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలి. దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంలో వర్సిటిని ఏర్పాటు చేస్తున్నారు. ఆవరణం చుట్టూ సుమారు సుమారు ఎనిమిది కిలోమీటర్లు ప్రహరీ నిర్మించాల్సివుంది. దీనిలో 4.5 కిలోమీటర్ల కాంపౌండ్ వాల్‌ను నిర్మించారు. మిగిలిన 3.5 కిలోమీటర్ల గోడను నిర్మించాల్సి ఉంది. ఈ నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేం. నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే ఇతరులు వర్సిటిలోకి రాకుండా చేయవచ్చు. విద్యార్థినుల భద్రత దృష్ట్యా తగిన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశాం.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

న్యూస్ బాక్స్

పూడికతీత పనులకు శ్రీకారం



ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేయిస్తున్న నాయకులు

ధర్మవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువు ఆయకట్టుకింద పూడిక తీత పనులను టీడీపీ నాయకులు చేపట్టారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సొంత నిధులతో ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి ప్రతి కాలువలో పూడికతీత పనులు చేశారు. ప్రతి రైతుకు నీరు అందేలా చూడాలన్నదే లక్ష్యమని అన్నారు. వరిపంటను సాగు చేసుందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. తుంగసేను కాలువ, రాగికాలువ, ముక్కంటి తూము కాలువ, గోరకాలువ, పెద్దకాలువలలో పూడికతీత పనులు చేశారు. ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాగులకట్ట నిర్మాణానికి భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28వ వార్డులో నాగులకట్ట నిర్మాణం కోసం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆ వార్డు కౌన్సిలర్ సరితాల ఆశాబీ, జనసేన నాయకులు సరితాల బాషా ఆహ్వానం మేరకు చిలకం మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై నాగలకట్టకోసం భూమి పూజ చేశారు. అక్కడే ఉన్న ఆంజనేయ స్వామి, పీర్లచావిడి, గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. జనసేన నాయకులు రాజారెడ్డి, సరితాల దస్తగిరి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థినికి సామగ్రి పంపిణీ చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

ఓబుళదేవరచెరువు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులకు మల్లెల రమేష్, అర్చకులు పంచరత్న సురేష్ శర్మ, కమిటీ చైర్మన్ రాజేష్ విద్యా సామగ్రిని సమకూర్చారు. గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషర్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు వాటిని అందించారు. నోటు పుస్తకాలు, పెన్నులను 300 మంది విద్యార్థులకు అందించిన దాతలను ఆయన అభినందించారు. డీఈఓ క్రిష్టప్ప, ఎంఈఓలు సురేష్, రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఏబీసీడబ్ల్యూఓ బాలాజీ, హెచ్‌డబ్ల్యూఓ సరస్వతి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారి

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి ఆరామంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖలాధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ బ్యాంక్‌ల అధికారులు, స్వయం సహాయక సభ్యులు, నెట్‌క్యాప్ సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు. సూర్యఘర్ పథకం విజయవంతంపై చర్చించారు. అ లాగే పుట్టపర్తి సమీపంలోని ప్రశాంతిగ్రామ్, బ్రాహ్మణపల్లి, బీడిపల్లి, మామిళ్లకుంట క్రాస్ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు రూఫ్‌టాప్ సోలార్ పథకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈలు శరవణన్, నరసింహారెడ్డి, ఏఈలు శివరాములు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

బత్తలపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకంపై శుక్రవారం ఆర్కే ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ సదస్సుకు హాజరుకావాలని ఆయన కోరారు. ఎస్‌ఈ సురేంద్రతో పాటు డీఈ, టాటాసన్‌టెక్ కంపెనీ ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారన్నారు. బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడి రుణం కూడా ఇచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు.

గ్రామాభివృద్ధిపై శిక్షణ

నల్లమాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రాబర్టువిల్సన్ అధ్యక్షతన గ్రామాభివృద్ధిపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులఎపై అన్నిశాఖలాధికారులకు అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, ఎలా పరిష్కరించాలన్న విషయాలను తెలిపారు. పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి చిన్న సమస్యను గుర్తించి పరిష్కరించాలన్నారు. శిక్షణలో సీనియర్ అసిస్టెంట్ లోటా మల్లికార్జునరెడ్డి, ఈఓఆర్‌డీ అమరనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు విశ్వనాథ్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మహమ్మద్‌బేగ్, సూర్యచంద్రారెడ్డి, త్రివేణి, మస్తాన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న మహిళలు

తనకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరామన్నగారిపల్లి గ్రామంలో 15 మంది మహిళలు ఓ సంఘంగా ఏర్పడ్డారు. ఎన్నోయేళ్లుగా సంఘాన్ని నడిస్తున్నారు. సంఘంలోని సభ్యురాలు రత్నమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు తలా ఓచేయి వేసి, రత్నమ్మ కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం గురువారం అందచేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

- రేపే పోలింగ్
- కూటమి నేతల వద్ద ఆశావహుల చక్కర్లు
- తలలు పట్టుకుంటున్న నాయకులు
- ధర్మవరం చెరువుకు తీవ్ర పోటీ...?

ధర్మవరంరూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువుతో పాటు మండలంలోని 7 గ్రామాల చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. 14వ తేదీన రెవెన్యూ, పోలీసుల సహకారంతో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ధర్మవరం చెరువు, గొట్లూరు, రావులచెరువు, సీసీ కొత్తకోట, రేగాటిపల్లి, పోతుకుంట, కట్టకిందపల్లి, చింతలపల్లి చెరువులకు సంబంధించి ఆయకట్టు భూముల రైతులతో ఎన్నికలు జరుగనున్నట్లు తెలిపారు.

ఎన్నికలు నిర్వహిస్తారిలా...

14వ తేదీన ఉదయం 8గంటలకు ఎన్నికల జరిగే ప్రదేశానికి ఆయకట్టు దారుల ఓటింగ్ ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఏదైనా ఓటరు, ఆధార్‌కార్డు తీసుకురావాల్సి ఉంటుంది. ఉదయం 8 నుంచి 9గంటల వరకు రైతుల నుంచి వివరాలు సేకరిస్తారు. ఎన్నికలకు కేటాయించిన గదులలో వారిని సమావేశపరుస్తారు. 9 నుంచి 9.40 గంటల వరకు ఏకాభిప్రాయం ద్వారా ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. లేనిపక్షంలో ఓటింగ్ ద్వారా టీసీ మెంబర్లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 3 నుంచి ఎంపికైన ఆరు మంది టీసీ మెంబర్లలో ఒకరిని ప్రెసిడెంట్‌గా, మరొకరిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేసుకుంటారు. దీంతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

ఎన్నికల ప్రదేశం, ఓటర్ల జాబితా..

చెరువుపేరు	ఓటర్లు	ఎన్నికల జరిగే ప్రదేశం
ధర్మవరం చెరువు	3164	ధర్మవరం వ్యవసాయ మార్కెట్‌యార్డు
గొట్లూరుచెరువు	695	జడ్పీ హైస్కూల్, గొట్లూరు
రావులచెరువు	463	జడ్పీ హైస్కూల్, రావులచెరువు
సీసీకొత్తకోట చెరువ	294	ఎంపీపీ పాఠశాల, సీసీకొత్తకోట
కాటిగానిచెరువు(రేగాటిపల్లి)	311	ఎంపీపీ పాఠశాల, రేగాటిపల్లి
పోతుకుంట చెరువు	278	జడ్పీ హైస్కూల్ పోతుకుంట
కట్టకిందపల్లి చెరువు	244	ఎంపీపీ పాఠశాల, కుణుతూరు
చింతలపల్లి చెరువు	287	ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ, వెటర్నరీ ఆసుపత్రి



ధర్మవరం చెరువు

ధర్మవరం చెరువుకు తీవ్రపోటీ?

జిల్లాలో బుక్కపట్నం తర్వాత అతిపెద్ద చెరువు ధర్మవరం. ఈ ఎన్నికల్లో ధర్మవరం చెరువుకు పోటీ ఎక్కువగా ఉన్నట్లు కూటమి నేతలు చెబుతున్నారు. మిగతా గ్రామాల్లోని చెరువులకు తమకే ఇవ్వాలని, కాదు తమకు ఇవ్వాలని కూటమి నేతల వద్ద ఆయా గ్రామాల నాయకులు వేడుకుంటున్నట్లు సమాచారం. దీంతో కూటమి నేతలు తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో వైసీపీ మద్దతుదారులు ఎవరూ కూడా ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ధర్మవరం చెరువుకు మాత్రం తమ వర్గానికి చెందిన ఒకరికి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.

సంస్థాగతంగా బలోపేతం కావాలి

ధర్మవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా, బలంగా తయారైతేనే పార్టీ బలోపేతం అవుతుందని బీజేపీ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్‌యాదవ్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లలో కమిటీలను ఏర్పాటు చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ బూత్‌స్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కమిటీలో అన్ని వర్గాల మహిళలకు, ప్రజలకు స్థానం కల్పించాలన్నారు. పోలింగ్ బూత్‌లు పూర్తి అయిన వెంటనే మండల కమిటీలు, ఆ తరువాత జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, చంద్రశేఖర్, నాయకులు గుండాపుల్లయ్య, డోలా రాజారెడ్డి, కొత్తకోట రవీంద్రారెడ్డి, శ్యామరావు, భక్తవత్సలం, పోతలయ్య, వీరనారప్ప, ప్రకాశ్, నబీరసూల్, చంద్రమహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కదిరి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి గ్రామోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయనుంచి ప్రత్యేకాలంకరణలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అయ్యప్ప మాలధారులు అయ్యప్ప నామస్మరణతో గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణ వీధులు అయ్యప్ప నామంతో మార్మోగాయి. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ శంకరయ్య, కటికల రమేష్, మాలధారులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట



ధర్మవరం: అలంకరణలో స్వామివారు

ధర్మవరం: అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గురుస్వామి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మాలధారులు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని గంధంఅలంకరణతో వాహనంలో ఉంచి పట్టణ పురవీధులగుండా ఊరేగించారు. చిన్నారులు, యువతులు జ్యోతులు పట్టుకుని వెళ్లారు. మాలధారులు పైడితుళ్లి ఆడుతూ అయ్యప్పస్వామి నామస్మరణతో పట్టణ వీధులు మార్మోగాయి.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

ధర్మవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు నైతిక విలువలు కూడా పెంచుకోవాలని బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు భగవాన్ భాయ్, రాధా సిస్టర్‌లు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులే భారతదేశ భవిష్యత్తు అని, విద్యార్థి జీవితంలో వారికి అందించిన విలువలపై మన దేశ భవిష్యత్తు చాలా ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా.. చెత్త సంపద కేంద్రం



చెత్త సంపద కేంద్రంలో ఉన్న మద్యం బాటిళ్లు

నంబులపూలకుంట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మమ్మమర్రిమాను వద్దనున్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. పంచాయతీ పరిధిలోని వ్యర్థాలను చెత్తసంపద కేంద్రానికి తరలించడానికి ఏర్పాటు చేశారు. కార్మికులు చెత్తను సేకరించి కేంద్రానికి తరలిస్తారు. ప్రస్తుతం కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేయపోవడంతో, ఇదే అదునుగా భావించిన మందుబాబులు మద్యం సేవించడానికి వినియోగించుకుంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ దుర్వాసన ఇంకెన్నాళ్లు..?



బస్టాండ్ వద్ద కాలువలో పేరుకుపోయిన మురుగు

నల్లమాడ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రధాన కూడలి సమీపంలో మురుగునీరు కాలువలో నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి, నీరు కదలకుండా నిలువ ఉందని ప్రజలు చెబుతున్నారు. బస్టాండు వద్ద నిలబడాలంటే దుర్వాసన భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. దోమలు అధికమై జ్వరాల బారిన పడే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న చిరుజల్లులకు మరింత దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, కార్మికులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరుకదిలేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యతోనే అభివృద్ధి

ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి

కదిరి అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు అభివృద్ధి సాధ్యమని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రాణీపేట పాఠశాల, కాళసముద్రం వద్దనున్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్, కాళసముద్రంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. రాణీపేట పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కాళసముద్రం రెసిడెన్షియల్ పాఠశాలలో వంటగది, స్టోర్ గదిని పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. ఆయనతో పాటు డీఈఓ క్రిష్టప్ప, జీసీడీఓ సంపూర్ణమ్మ, ఎంఈఓ చెన్నక్రిష్ణ, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, సివిల్ సప్లై, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పర్యవేక్షణ కొరవడితేఎలా?

ఓబుళదేవరచెరువు: మండల వ్యాప్తంగా ఒక్కరే సూపర్‌వైజరున్నారు. 103 అంగన్‌వాడీ కేంద్రాలను ఎలా తనిఖీ చేస్తారని ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మిని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం మండలంలోని గౌనిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి? ఎంతమంది సూపర్‌వైజరులున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీడీ స్పందిస్తూ 103 కేంద్రాలున్నాయని, ఒక్కరే సూపర్‌వైజర్ ఉన్నారన్నారు. పర్యవేక్షణ కొరవడుతోందని, వెంటనే మరో సూపర్‌వైజర్‌ను నియమించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీఈఓ క్రిష్టప్ప, సూపర్‌వైజర్ విజయ్‌కుమారి, ఎంఈఓలు సురేష్, రమణ పాల్గొన్నారు.



కాళసముద్రం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

ధర్మవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ మండల కో-కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పనిముట్లు సక్రమంగా ఇవ్వాలని, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. వారికి రావాలసిన దహన సంస్కారాల సొమ్ము రూ.15వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.2లక్షలు ఇప్పించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలు పరిష్కరించాలని, ఇంటి స్థలాలు మంజూరు చేసి గృహాలు మంజూరు చేయాలన్నారు. 3వ డివిజన్ మస్టర్ ఆఫీసును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కో-కన్వీనర్‌లు అయూబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ, పారిశుధ్య కార్మిక యూనియన్ నాయకులు చెన్నకేశవులు, బాబు, ముకుందా, లక్ష్మీఓబుళేశు, పెద్దక్క, ఓబుళప్ప, చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల పెంపును నిరసిస్తూ గురువారం సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, నాయకులు సున్నంపల్లి రమణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప మాట్లాడుతూ రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం పడిందన్నారు. ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, విద్యుత్‌డ్యూటీ, సర్వీస్ చార్జీలు తదితర పేర్లతో బిల్లులు పెంచడం సరికాదన్నారు. ఇందుకు నిరసనగా విద్యుత్ బిల్లులు దహనం చేసినట్లు తెలిపారు. పెంచిన బిల్లులు తగ్గించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రమణ, వెంకటరంగారెడ్డి, మనోజ్, నరసింహులు పాల్గొన్నారు.

వర్షం రాకతో ఆగిన వరికోతలు



కోతలు నిలిచిపోయిన వరి మడి

గాండ్లపెంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షం రాకతో వరికోతలు గురువారం నుంచి ఆగిపోయాయి. వారంరోజుల క్రితం కురిసిన వర్షాలకు తేమ శాతం పెరిగిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కోత సమయంలో వర్షాలు కురుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తుఫాన్ ప్రభావంతో వరికోత కోయలంటే యంత్రాలు కూడా రావడం లేదని అంటున్నారు. మూడురోజులు తుఫాన్ ఉందని వాతావరణ శాఖ చెబుతున్నారన్నారు. వరి పంటను ఏమిచేయాలో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు 60 శాతం కోతలు అయిపోయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మరోవైపు కోసిన వరికి ఎక్కడ మొకలొస్తాయోనని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస తుఫాన్లతో ఇబ్బందులు పడుతున్నామని వరి రైతులు చెబుతున్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

కొత్తచెరువు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ముసలమ్మగారి యశ్వంత్(18) చికిత్స పొందుతూ గురువారం అనంతపురంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో మృతిచెందినట్లు తల్లి చంద్రకళ తెలిపారు. యువకుడి తండ్రి ప్రసాద్ మూడేళ్లక్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతుని తట్టుకోలేక యశ్వంత్ మానసిక ఆందోళనకు గురవుతూ చదువును కూడా ఆపేశాడు. తీవ్ర మనస్థాపానికి గురై శనివారం మైలసముద్రంలోని అమ్మమ్మ ఇంట్లో పురుగుల మందు తాగాడు. యశ్వంత్ తాను పురుగుల మందు తాగినట్లు కడుపు మంటగా ఉందని వాంతులు, విరేచనాలు రావడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. యువకుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌కు గాయాలు

తనకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీటీ క్రాస్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేసు తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు తెలిపిన మేరకు సొంత పనిమీద గురువారం సాయంత్రం కొక్కంటి క్రాస్‌కు వచ్చి పనిముగించుకొని స్వగ్రామానికి వెళుతుండగా బీటీ క్రాస్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైయింది. వందేమాతరం టీం సభ్యుడు ఆశోక్ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కదిరి ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

పురం రోడ్ల నిండా గుంతలే

● ప్రతి కిలోమీటరుకు పదుల సంఖ్యలో గుంతలు
● వాటిపై ప్రయాణం నరకయాతనే..
● వర్షం వస్తే లోతు, పొడవు తెలియని వైనం
● ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు

ప్రతి ఊరికీ ఓ ప్రత్యేకత ఉంటుంది. కొన్ని ప్రాంతాలు పుణ్యక్షేత్రాలకు, మరికొన్ని ఆహార పదార్థాలకు ప్రసిద్ధికెక్కుతాయి. బందరు లడ్డూ గురించి, కొత్తపల్లి కొబ్బరి గురించి తెలియనివారెవరు? కాని సత్యసాయిజిల్లా హిందూపురం మాత్రం రోడ్ల గుంతలకు ప్రసిద్ధికెక్కిందని చెప్పవచ్చు. ఈ పట్టణ ఎమ్మెల్యే ఓ ప్రముఖ వ్యక్తి అయినా రోడ్లు మాత్రం నరకలోకానికి చిరునామాలుగా కనిపిస్తున్నాయి.



ఏఆర్ ఆసుపత్రి ముందు నోరు తెరుచుకున్నగుంత

హిందూపురం అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా లో అనంతపురం తరువాత హిందూపురం పెద్ద పట్టణం. జనాభాలోను, వైశాల్యంలోను పెద్దదే. కర్ణాటక సరిహద్దులోని పరిశ్రమలు, ముద్దిరెడ్డిపల్లి పట్టు చీరల పరిశ్రమ, ఇలా పురం చుట్టూ పలు పరిశ్రమలు ఉన్నాయి. కోట్లాది రూపాయిల ఆదాయం వస్తున్నా పరిస్థితి మాత్రం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న విధంగా తయారైంది. పట్టణ వ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలతో అడుగు తీసి అడుగు వేయలేని విధంగా



రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పరిస్థితి

అధ్వాన్నంగా తయారయ్యాయి. ధనలక్ష్మీరోడ్డు, రైల్వే రోడ్డులలో ప్రయాణం చేయాలంటేనే భయమేస్తుంది. గురునాథ్ థియేటర్ వద్ద నుంచి రహమత్‌పురం వరకు. తరువాత రహమత్‌పురం నుంచి బెంగళూరు హైవే వరకు, అక్కడ నుంచి పారిశ్రామిక వాడ వరకు రోడ్డు నిండా గుంతలే గుంతలు. ఏదైనా పెద్ద వాహనం ముందు వెళ్తుంటే దాని వెనుక ఇంటికి వెళ్లేసరికి దుమ్ముతో నిండిపోవాల్సిందే. సాధారణంగా ఒక కిలో మీటరు దూరం వాహనం ప్రయాణించాలంటే ఒక నిమిషం, లేదా రెండు నిమిషాల సమయం పడుతుంది. అదే హిందూపురం పట్టణంలో అయితే ఒక కిలో మీటరు ప్రయాణించాలంటే దాదాపు 10 నిమిషాలు పడుతుంది. ఆటోలో వెళితే కుదుపులకు ఒళ్ళు హూనం కావడం ఖాయం. ఇక వర్షాలు వస్తే గుంతల్లో నీరు చేరి ఏగుంత ఎంత లోతు ఉందో తెలియని పరిస్థితి. కొత్త వారు. పట్టణానికి వస్తే ప్రమాదాలు తప్పవని హిందూపురం ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇలా ఎంతోమంది ప్రమాదాల బారినపడి ఆసుపత్రికి చేరారు. వేగంగా వచ్చి గుంతల్లో వాహనాలు దింపడంతో వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం గుంతల్లో తాత్కాలికంగా మట్టి కూడా వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చిన ప్రతిసారి 'టెండర్లు పిలిచాము. త్వరలో చేపడతాము' అని మాత్రం అధికారులు చెబుతున్నారు. తరువాత షరా మామూలే. మరి ఎప్పుడు రోడ్లు మరమ్మతులు చేపడతారో వేచి చూడాలి.

ఈ రోడ్ల సమస్యలపై ఆర్ అండ్ బి ఏఈ మోహన్‌ను వివరణ కోరుదామని ఎంత ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు.

10 రోజులకు ఒక మారు మరమ్మతులకు



కష్టపడి చెమటోడ్చి సంపాదించిన డబ్బు ఆటో రిపేరీలకు ఖర్చు అవుతోంది. గుంతల రోడ్డులో ఆటో ప్రయాణికులతో వెళ్తుండటంతో బరువుకు బేరింగులు విరిగిపోతున్నాయి, యాక్సిల్ కట్‌అవుతోంది. టైర్లు పంచర్ అవుతున్నాయి. సంపాదనంతా మరమ్మతులకు సరిపోతోంది.

నౌషద్,
ఆటోడ్రైవర్

బజారుకు వెళ్లి వచ్చే సరికి ఒళ్ళు హూనం



హిందూపురం రోడ్లలో ఒక్కసారి ప్రయాణిస్తే మరలా చాల అత్యవసర పని ఉంటే గాని బజారుకు వెళ్ళాలనిపించదు. ఇంటికి వచ్చేసరికి ఒళ్లంతా హూనమైతా ఉంది. అధికారులు స్పందించి కనీసం రోడ్లు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

జబీవుల్లా,
గ్రిల్ వర్కర్

కూలీలకు వేతనం ఇవ్వకుంటే ఎలా?

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి



స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేసి అధికారులతో చర్చిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గోరంట్ల, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పౌర సరఫరాల గోడౌన్‌లో పనిచేస్తున్న కూలీలకు కాంట్రాక్టర్ కూలి డబ్బులు సకాలంలో ఇవ్వకపోవడం పట్ల రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి గురువారం ఆగ్రహించారు. మండలంలోని పాలసముద్రం అంగన్‌వాడీకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టోర్‌రూం, పిల్లల ప్రతిభాపాఠశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మల్లాపల్లిలోని పాఠశాలను సందర్శించి నాణ్యమైన భోజనం వండిపెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం గోరంట్ల స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేశారు. అక్రమ రవాణాలో పట్టుబడిన 117 టన్నుల రేషన్ బియ్యం నిలువలపై ఆయన ఆరా తీశారు. కోర్టు ఉత్తర్వులు వచ్చేవరకు బియ్యాన్ని అలాగే ఉంచాలని స్టాకిస్టు మనోహర్ తెలిపారు. గోడౌన్‌ను ప రిశీలించి, బియ్యం బస్తాతూకం చేయించి తనిఖీ చేశారు. నిత్యావసర వస్తువుల సరఫరాపై ఆరాతీస్తూ, పనిచేసే హమాలీలతో మాటాడారు. మేస్త్రీ గంగాధర్ గోడౌన్‌లో 9మంది హమాలీలు పనిచేస్తున్నారని, దుకాణాలకు లారీలో సరుకులు తీసుకెళ్లే సమయంలో బయట హమాలీలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. వారికి వెంటనే కూలి డబ్బులు చెల్లించాల్సి ఉందని, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ అశ్వర్థప్ప బిల్లులు వచ్చేవరకు ఇవ్వడంలేదన్నారు. ఏపూటకాపూట సంపాదించుకునేవారికి వెంటనే డబ్బులు ఇవ్వకపోతే ఎలా అని ప్రతాప్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఆమాత్రం సర్దుబాటు చేయలేని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సివిల్‌సప్లే డీఎం అశ్వర్థనాయక్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డీఈఓ కిష్టప్ప, ఎంఈఓలు గోపాల్, జాన్‌రెడ్డెప్ప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రజిత, నాగరాణి, తూనికలు, కొలతల అధికారి శివశంకర్‌రెడ్డి, సీఎస్‌డీటీ శ్రీధర్, ఆర్‌ఐ సోముశేఖర్‌రెడ్డి, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బాబాయ్య, విజిలెన్స్ కమిటీ సభ్యులు మణి మాల తదితరులున్నారు.

భూసమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం

రెవెన్యూ సదస్సుల్లో అధికారుల హామీ



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

పెనుకొండ రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):45రోజుల్లో కూటమి ప్రభుత్వం భూ సమస్యలకు పరిష్కారం చూపుతుందని తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని శెట్టిపల్లిలో తహసీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలుంటే రెవెన్యూ సదస్సులో అర్జీలు అందించాలన్నారు. రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరించిన రైతులకు 45రోజుల్లోగా సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. అనంతరం మ్యూటేషన్‌కు సంబంధించి 5, జాయింట్ సబ్‌డివిజన్‌కు సంబంధించి 4, మొత్తం తొమ్మిది అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దయ్య, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, గోపాల్‌నాయక్, నాగేనాయక్, శెక్షావలి, రామాంజినేయులు పాల్గొన్నారు.

సోమందేపలి: మండల పరిధిలోని చల్లాపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సమస్యలు వెల్లువలా వ చ్చాయి. ఇంటి పట్టాల కోసం 8, ఇంటి నిర్మాణం 3, రోడ్డు వివాదం 1, రీసర్వే, భూ సమస్యలు 27, రేషన్ కార్డులు 12, స్మశానవాటిక 2, మ్యూటేషన్ 20, పెన్షన్ కోసం 141 వినతులు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిశేఖర్ తెలిపారు.

గుడిబండ :మండలంలోని మోరుబాగల్ గ్రామంలో గురువారం రెవిన్యూ అధికారులు రెవిన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుండి వినతులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, ఆర్‌ఐ మహ్మద్ పాల్గొన్నారు.

అమరాపురం:మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో గురువారం సర్పంచు గిరిజమ్మ సదానందగౌడ్ అధ్యక్షతన రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మారుతీప్రకాస్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. భూ సమస్యలకు సంబంధించి 20 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో రెవిన్యూ కార్యదర్శి మహేంద్ర, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, ఆర్‌ఐ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మహర్దశ

● రూ.1.90 కోట్లు మంజూరు ● 30 కి.మీ. మేర మరమ్మతులు



భక్తరహళ్ళి గుడి రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నదృశ్యం

మడకశిర, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు కావడం తో వాటి రూపురేఖలు మారుతున్నాయి. గత రెండు సంవత్సరాలుగా వర్షాలు కురిసినప్పడల్లా ఆ రోడ్లు మరింత దెబ్బతింటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయడమే గాక పనులు కూడా వేగవంతంగా చేపడుతున్నారు. కంపచెట్లను తొలగించేందకు రూ.37 లక్షలు మంజూరు అ య్యాయి. దీంతో భక్తరహళ్ళి నుంచి మడకశిర వరకు రోడ్డు ఇరువైపుల ఉన్న కంప చెట్లను తొలగిస్తున్నారు. మడకశిర ఆర్ అండ్‌బి పరిధిలోని భక్తరపల్లి రోడ్డు, బుళ్ళసముద్రం వెంకటమ్మపల్లి రోడ్డు, పరిగి యూ.రంగాపురం రోడ్డు, గోవిందాపురం కేకాతి రోడ్డు, గుండుమల - ఎస్.రాయాపురం, గంగళవాయిపాళ్యం రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం: నరసింహమూర్తి, ఏఈ

నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లకు రూ.1.90 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నాం. త్వరలో అన్నీ పూర్తి చేస్తాం.

క్లుప్తంగా..

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు అందచేస్తున్న సాయి భక్తులు

గోరంట్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో సత్యసాయిబాబా భక్తులు వందమంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రిని గురువారం అందించారు. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన మొరార్జీబాయ్‌పటేల్ మిత్రబృందం పుట్టపర్తికి విచ్చేసిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సత్యసాయి జిల్లా మహిళ సేవాదల్ కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, శివారెడ్డి దంపతులు, సేవాసమితి సభ్యులు సుబ్బరాయుడు, రత్నమయ్య, హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి

పెనుకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులపై భారం పడేలా ఉన్న ట్రూఅప్ విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఈఈ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడోదఫా కూడా ట్రూ అప్ చార్జీలు వినియోగదారులపై వేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివస్తే చార్జీలు పెంచమని వాగ్దానం చేశారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఇప్పటికే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదానీతో ఒప్పందం రద్దుచేసి తక్కువ ధరకే విద్యుత్ అందివ్వాలని స్మార్ట్‌మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోపలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష

పరిగి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధరించిన మాలదారులకు గురువారం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలోగల అయ్యప్ప దేవాలయంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆధ్వర్యంలో భిక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ టీడీపీ నాయకులు శశిభూషణ్, సాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ.. అయ్యప్పస్వామి దేవస్థానం నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ఈశ్వరప్ప, మోదా కుమార్, వడ్డె హనుమయ్య, శ్రీనివాసరెడ్డి, గురుస్వామి పూలనరసింహప్ప, లింగారెడ్డి, కన్నప్ప, సురేష్, బాలాజీ, బీరలింగ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మడకశిరటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసకాకుండా దూరంగా ఉండాలని, పెనుకొండ డీఎస్పీ వెంకటేశులు అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో గురువారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతీయువకులు గంజాయి, సిగరెట్, గుట్కా వంటి మత్తుపదార్థాలకు బానిస కావద్దని సూచించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఫోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, అనర్థాలు, ఈవ్‌టీజింగ్, రహదారి భద్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సోషియల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ రాగిరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు పోరుబాట పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దీపిక, ఇతర వైసీపీ నాయకులు

హిందూపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టే రైతు పోరుబాట చేపట్టే పోస్టర్లను గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు రైతు పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు పుట్టపర్తిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జబీవుల్లా, శివ, శ్రీరామిరెడ్డి, తిమ్మారెడ్డి, గిరి, షాజియా, సీఎన్‌పి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెనుకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని టింబక్టివ్ కలెక్టివ్ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి పేర్కొన్నారు. గురువారం స్థానిక బీటీఆర్ కాలనీలో దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షురాలు ముంతాజ్‌బేగం అధ్యక్షతన ఉచిత న్యాయసేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ గృహహింస, బాల్యవివాహాలు, తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. సమాన వేతనాలు, గృహహింస గురించి ఆడిట్ రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసోసియేట్ పావని, మహాశక్తి కోఆర్డినేటర్ గౌరీ, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాబయ్యస్వామికి చాదర్ సమర్పణ

పెనుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ బాబయ్యస్వామి 752వ గంధం ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని సీపీఐ అనుబంధ సంస్థ అయిన ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ నాయకుడు శ్రీరాములు, ఫకీర్లు, స్వామివారికి చాదర్‌ను గురువారం సమర్పించారు.

నేడు బాబయ్య స్వామికి మంత్రి చాదర్

బాబయ్యస్వామి ఉరుసు సందర్భంగా బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత శుక్రవారం చాదర్ సమర్పించనున్నట్లు కన్వీనర్ శ్రీరాములు గురువారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం దర్గాకు చేరుకుని ప్రభుత్వం తరపున చాదర్ సమర్పించనున్నట్లు తెలిపారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి ఆరామంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖలాధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ బ్యాంకుల అధికారులు, స్వయం సహాయక సభ్యులు, నెట్‌క్యాప్ సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు. సూర్యఘర్ పథకం విజయవంతంపై చర్చించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈలు శరవణన్, నరసింహారెడ్డి, ఏఈలు శివరాములు, పాల్గొన్నారు.

వణుకుతున్న గ్రామాలు



మిరపకాయలపై కప్పిన టార్పాలిన్

మడకశిర రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) తుఫాన్ ప్రభావంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజాజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ తుఫాన్ ప్రభావంవల్ల వర్షం కంటే చలి అధికంగా ఉంది దీంతో గ్రామాలన్నీ చలితో వణికిపోతున్నాయి. ఎవ్వరూ ఇళ్లనుంచి బయటికి రాలేకపోతున్నారు. చిన్నారులు.వృద్ధులు వ్యాధులతో బాధపడుతున్నవారి పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉంది. చేతికి వచ్చిన పంట వర్షాలకు తడిసిపోవడంతో ఆర్థికంగా మరింత నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మిరపకాయలపై టార్పాలిన్ కప్పి కాపాడుకుంటున్నారు. తురుకువాండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు అమిర్ బాషా మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా మిరప రంగు మారితే ధరలు తక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

పదో తరగతికి వందరోజుల ప్రణాళిక

అగళి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు వంద రోజుల ప్రణాళికను విద్యాశాఖ విడుదల చేసిందని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. గురువారం మధుడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి సందర్శించి 10వ తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగించాలని చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్ ఎంతవరకు పూర్తయిందో విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. సమయం వృధా చేసుకోకుండా క్రమశిక్షణతో పట్టుదలతో బాగా చదవాలన్నారు. మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

నేడు రామాపురంలో హనుమజ్జయంతి వేడుకలు

అగళి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అగళి మండలం రామాపురం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వీరాంజనేయస్వామి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మార్గశిర శుద్ధ త్రయోదశి శుక్రవారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఉదయం 9గంటలకు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, సహస్రనామ పూజ, ఆకుపూజ, కుంకుమార్చన తదితర కార్యక్రమాలునిర్వహిస్తామన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు

గుడిబండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫళారం సమీపంలోని వంక నీటి కారణంగా కొట్టుకుపోయిన రోడ్డును సర్పంచు సతీష్ మరమ్మతు చేయించారు. గత సంవత్సరం నుంచి గుంతలు పడటంతో ఆ రోడ్డులో ప్రయాణించాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణించాల్సి ఉండేది. గురువారం సర్పంచు జేసీబీ, ట్రాక్టర్‌తో మట్టిని తోలించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు రోడ్డును సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు.

మోహన్ బాబును అరెస్టు చేయాలి

పెనుకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో న్యూస్ కవరేజ్ చేయడానికి వెళ్లిన విలేకరిపై దాడిచేసి గాయపరిచిన సినీనటుడు మోహన్‌బాబును వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం పార్టీ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ నాయకులు హరి, సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్, బాబావలి, మహబూబ్‌బాష, గంగాధర్, తిప్పన్న, రాజారావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ విలేకరులపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకొచ్చి వాటిని సక్రమంగా అమలు చేయాలన్నారు.

రేపు దత్త జయంతి

పెనుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణ షిర్డీగా పేరుగాంచిన షిర్డీసాయి మందిరం, ఆల్విన్‌కాలనీలోని షిర్డీసాయి మందిరాల్లో శనివారం దత్తజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు సుబ్రమణ్యశాస్త్రి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం పంచామృతాభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, గణపతి నవగ్రహ రుద్రస్వాహాకార హోమాలు, పూర్ణాహుతి, అన్నదానం, సాయంత్రం 4గంటల నుంచి అఖండ సాయినామ సంకీర్తన నిర్వహించనున్నట్లు తెలిపారు.

వర్షం రాకతో ఆగిన వరికోతలు

గాండ్లపెంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షం రాకతో వరికోతలు గురువారం నుంచి ఆగిపోయాయి. వారంరోజుల క్రితం కురిసిన వర్షాలకు తేమ శాతం పెరిగిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కోత సమయంలో వర్షాలు కురుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తుఫాన్ ప్రభావంతో వరికోత కోయలంటే యంత్రాలు కూడా రావడం లేదని అంటున్నారు. మూడురోజులు తుఫాన్ ఉందని వాతావరణ శాఖ చెబుతున్నారన్నారు. వరి పంటను ఏమిచేయాలో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు 60 శాతం కోతలు అయిపోయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మరోవైపు కోసిన వరికి ఎక్కడ మొకలొస్తాయోనని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస తుఫాన్లతో ఇబ్బందులు పడుతున్నామని వరి రైతులు చెబుతున్నారు.



కోతలు నిలిచిపోయిన వరి మడి

సీసీ రోడ్ల మాటున ఇసుక దోపిడీ

● విచ్చలవిడిగా ఇసుక తోలుకుని సొమ్ముచేసుకుంటున్న ట్రాక్టర్ల ఓనర్లు
● డంప్ చేసుకుని కర్ణాటకకు తరలింపు



సువర్ణముఖి నదిలో ఇసుకను తోడుతున్న దృశ్యం

అగళి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) కర్ణాటక నుంచి అగళి ఎనిమిది కిలోమీటర్ల వరకు సువర్ణముఖి నది పారుతుంది. ఎగువ ప్రాంతం నుంచి వర్షాలు బాగా పడితే సువర్ణముఖి నది మీదుగా అగళి చెరువు, మిగతా మధూడి, రావుడి, తదితర ప్రాంతాల చెరువులకు కూడా నీరు వెళుతుంది. దీనివల్ల గ్రామాల్లోని రైతులు వక్కతోటలు, మామిడి తోటలు, పూల తోటలు, తదితర పంటలను సాగుచేసుకుని జీవనం సాగిస్తూ ఉంటారు. అయితే సువర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తరలించి గుంతల మయంగా తయారుచేస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతాయి. దీంతో మండల వ్యాప్తంగా బోరుబావుల్లో వెయ్యి నుంచి 1500అడుగులు తవ్వినా నీరు లభించడం కష్టమవుతుంది. అయితే గత రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండటమేకాక చెరువు లోపల కూడా నీరు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలన్న నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వం ఇళ్లకు మరుగుదొడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణానికి ఆయా గ్రామాలలోని ఇసుక తోలుకోవాల్సి ఉంది. దీనికి విరుద్ధంగా ట్రాక్టర్ యజమానులు సువర్ణముఖి నది నుంచి సీసీ రోడ్ల నిర్మాణం పేరుతో ఇసుకను డంపు చేసుకుని కర్నాటక ప్రాంతానికి తరలిస్తున్నారు. సువర్ణముఖి నది నుంచి అగళి, రొళ్ల, మండలాలకే కాక కర్నాటక ప్రాంతానికి విచ్చలవిడిగా తోలుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక ఆంధ్ర ప్రాంతంలోనే తోలితే రూ.2వేల నుంచి రూ.2500వరకు, కర్నాటక ప్రాంతంలో రూ.3వేల వరకు పొందుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల అగళి మండలం బోరుబావుల్లో నీరు లేక ఎడారి ప్రాంతంగా మారే అవకాశాలున్నాయని రైతులు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.